

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**సైకిల్‌పై వన్నెలాడీ పోతున్నదీ...**

"అమ్మా నిన్నేమైనా అన్నారా

నిన్నెవరైనా తిట్టారా

నిన్నెవరైనా కొట్టారా..

చెప్పమ్మా, శకుంతలమ్మా, చెప్పమ్మా

ఈ కణ్వుడితోటీ జరిగిందంతా చెప్పమ్మా"

నేను కష్టపడి కొబ్బరిపీచుతో తయారు చేసిన గడ్డం నిమురుకుంటూ 'పాట' లంకించుకున్నాడు క్రిరుచెప్పుల మధుగాడు. సురభివాళ్ళు వచ్చి వెళ్ళాక మా పాకబడి బేచ్ వాళ్ళం నాటకం ప్రాక్టీసు చేస్తున్నాం. త్వరలో స్కూలు యానివర్సరీ జరగబోతోంది. 'శకుంతల' నాటకం వేస్తామని మేము పేరిచ్చాం. నేను పాటల పోటీకి కూడా పేరిచ్చా.

నాటకం పుస్తకాలు దొరికినా, అన్ని గంటలు ఆడలేం కదా! ఫిఫ్తుఫాం తెలుగు పుస్తకంలో వుండే 'శకుంతల' పాఠాన్నే నాకు తోచినట్టు నాటకంగా రాశాను. దాన్ని మా కృష్ణారావు మాస్టారికి చూపిస్తే, "మూడున్నర పేజీల్లో మొత్తం నాటకాన్ని ఎంత బాగా రాశావే సీతా! తిరుగులేదుపో.!. అయితే పాటలో పద్యాలో లేకపోతే ఏం బాగుంటుంది?" అన్నారు.

"పద్యాలు మీరు రాసిపెట్టండి మాస్టారూ., మీరు రాస్తే బ్రహ్మాండంగా వుంటై!" అని ఆయనకే పద్యాలు రాసేపని పురమాయించా. ఇహ పాటలు. ఏం? మనమెందుకు రాయకూడదూ?

"ఏసుకో నారిగా దోసకాయ పచ్చడీ" అని చిట్టెమ్మ పచ్చడి నూరేటప్పుడూ, "ఎయ్..ఎయ్‌రో.. సూత్తావేరో" అని చాకలి రావుడు బట్టలుతికేటప్పుడు నేను కట్టిన పాటలూ బాణీలూ అప్పటికే బహుళ ప్రచారం పొందివున్నై కదా! మరిప్పుడు ఎందుకు రాయకూడదూ? ఆ హుషారులో రాసిందే పైన రాసిన పాట. విచారంగా మౌనంగా కూర్చున్న శకుంతలని కణ్వుడు చూసి, ఆ పాట పాడాలన్నమాట.

"ఏమి చెప్పను.. నేనేమి చెప్పను (ఏ...మి చెప్పను..నేనేమి చెప్పను. 'ఏ'..కీ'ము'కి మధ్యలో రాగం అన్నమాట.)

చెప్పాలంటే సిగ్గూ బిడియం..

వచ్చినవాడూ మా రాజయ్యో

జరిగిందేమని అడగొద్దయ్యో!" అని శకుంతల జవాబివ్వాలి.

"సిగ్గన్నా బిడియమన్నా ఒకటేగదే! తప్పుకాదూ అలా రాయడం?"

మా యస్సెల్సీ సువర్ణ జయప్రదాదేవి అడిగింది.

"సిగ్గంటే సిగ్గు.. బిడియమంటే బిడియం.. అంటే ఇంకా సిగ్గన్నమాట.- ఇప్పుడు సిగ్గూ బిడియం రెండూ కలిస్తే మహా సిగ్గన్నమాట.. అంతకి మించిన సిగ్గు ఇంకోటేదీ లోకంలో లేదన్నమాట!" తీవిగా జవాబిచ్చాను.

(అబద్ధం ఆడేటప్పుడూ, తెలియనిది తెలిసినట్టు చెప్పేటప్పుడూ యమా గంభీరంగానూ తీవిగానూ మొహం పెట్టాలన్నమాట. అప్పుడే ఏ డౌటూ లేకుండా మనమాట చెల్లుబడి అవుతుంది.. ఇది 'మన' స్వానుభవం)

ప్రస్తుతం మేము 'బూరుగు చెట్టుక్రింద' ప్రాక్టీసు చేస్తున్నామన్నమాట. స్కూలంతా హడావిడిగా వుంది. లీజర్ పీరియడ్ గనక పర్మిషన్ తీసుకుని ప్రాక్టీసు మొదలెట్టాం. 3rdForm వాళ్ళకి కూడా లీజర్ గనక వాళ్ళు మా చుట్టూ గుండ్రంగా కూచుని మమ్మల్ని ఎంకరేజ్ చేస్తున్నారు. జయలక్ష్మీ, పుష్పకుమారీ, విజయలక్ష్మీ ఆఖరికి కమలకుమారి కూడా చెలికత్తెల వేషంలో అంటే జుట్టుని నెత్తిమీద కొప్పుగా పెట్టుకుని యమా ఉత్సాహంగా నటించేస్తున్నారు. శకుంతల వేషం వేస్తున్నది ది గ్రేట్ యాక్ట్రెస్, ఎండ్, క్రామేడ్ సీత!

"చెలీ శకుంతలా .. యీ మౌనమేల?" ప్రియంవద వేషంలో ఉన్న పుష్పకుమారి.

"ఒక్క ఫలమునైనా ఆరగించవా నెచ్చెలీ?" చేతిలో రేక్కాయ పట్టుకుని అడిగింది మదాలస అనగా జయలక్ష్మి.

"అదిగో ఆ జింక నీ మౌనమును సహింపలేక ఎలా బేలచూపులు చూస్తున్నదో చూడవే హరిణీక్షణా.!" క్రామేడ్ విజయలక్ష్మి (ఈ చెలికత్తెకు ఏపేరూ పెట్టలా) సాగదీసింది. నేను గొంతు సవరించుకునేలోగా ఓ ఉపద్రవం జరిగింది. బూరుగు చెట్టు మీద కాకి, కరెక్టుగా కణ్వమహర్షి ముక్కుమీదనించి గడ్డం మీద చిందేట్టుగా లెక్కలు, చూసుకుని మరీ రెట్టవేసింది. కణ్వమహర్షి అనగా మధూగాడు 'లబోదిబో' చుట్టూ జనాల గోలగోలా! నవ్వులూ! ప్రదర్శన మధ్యలో ఆగింది.

"ఇక చచ్చినా నేనీ గడ్డం అంటించుకోను.. యీ వేషం నాకు ఒద్దు.. చెడదురదా చెడకంపూ.!" గడ్డం పీకాడు మధూగాడు.

ఓ గుడ్డకి మైదాపిండి (ఉడకబెట్టిన మైదాపిండి) రాసి, దానిమీద బాగా 'దువ్వి' సాఫు చేసిన కొబ్బరిపీచు అంటించా. ఆ కొబ్బరి పీచుకి పెయింటర్ జానీగాడ్ని రిక్వెస్టు చేసి తెలుపు రంగు పూయించా. తలకి మాత్రం తెల్లతువ్వాలు చుట్టాను. పెయింటు కంపూ + కాకిరెట్ట సెంటూ కలిసి వాడి ముక్కు పుచ్చింది.

"సరేరా మధూగా.! అర్జంటుగా ఆ వేషం, దివాకర్‌గాడి చేత వేయిస్తా. స్టేజీ మీద వెలిగిపోవల్సిన వాడివి కాస్తా, జనాల్లో కూచుని చూద్దుగాని!" అని నేను బెదిరించా. 'స్టేజిమీదా', 'వెలిగిపోవటం' అన్న రెండు మాటలూ వాడ్ని సైలెంటు చెయ్యటానికి చాలని నాకు తెలుసు.

"వొద్దులే.! నేనేవేస్తా! కాకి రెట్టపడి కంపుకొడితే అలాగన్నాకానీ, మధ్యలో ఎందుకొదిలేస్తానూ!" అంటూ కాళ్ళబేరానికి వచ్చాడు.

ఓ వారం రోజులు ప్రాక్టీసు చేశాం.. వెలమవారి గొడ్లపాకలో. దుష్యంతుడి వేషం వేస్తానని పార్వతీశంగాడు నేలమీద పొర్లిగింతలు పెట్టి మరీ ఏడ్చాడుగానీ, మహారాజుకి మెల్ల కళ్ళుంటే ఏం బాగుంటుందని వాడికి నచ్చచెప్పేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చింది. ఆ వేషం దిట్టంగా వుండే అమ్మాజీకి కట్టబెట్టి కాస్త 'మగగొంతు'తో మాట్లాడాలని కండీషను పెట్టా. పాపం మగ గొంతుతో డైలాగులు చదివీ, పాటలుపాడీ, దానిగొంతే మగరాయుడి గొంతైపోయింది. నన్ను చూస్తే ఇప్పటికీ అది తిడుతూనే ఉంటుంది.

'మేకప్' మా డ్రాయింగ్ మాస్టారు నాగేశ్వరరావుగారు వేసి పెడతామన్నారు. ఎవరి డ్రస్సులు వాళ్ళవే. మా నాన్నకి విషయం చెబితే, బాగా మెచ్చుకుని, చాలా డబ్బు ఖర్చుపెట్టాడు. మా అమ్మ యధాప్రకారం రోజుకి మూడుసార్లు, "హూ.! ఏం రెచ్చిపోతున్నార్రా తండ్రీకూతుళ్ళు.!. ఇప్పుడు నాటకాలంది!. తరవాత సినిమాలంటుంది!. ఆ తరవాత పెళ్ళీ పెడాకులు లేకుండా మగరాయుళ్ళా రాజ్యాలేలతానంటుంది!. ఇంతకీ నా ఖర్మ.., మా యింటివాళ్ళ ముందర నా పరువుపోవాలని రాసివుంటే తప్పుతుందా! " అంటూ విధిగా 'ప్రవర' చదివేది ప్రతిరోజూ.

రేపు యానివర్శరీడే అనంగా ఇవ్వాళ డ్రెస్ రిహార్సల్ జరిగింది. మా నాన్న నన్ను ఏలూరు తీసికెళ్ళి మరీ దుస్తులు కుట్టించాడు. అమ్మాజీ వాళ్ళు బాగా ఉన్న వాళ్ళు గనక, దానికీ 'మహారాజు' డ్రెస్సులు ప్రత్యేకం కుట్టించారు. మిగతా చెలికత్తెల కందరికీ కాషాయం సిల్కు చీరలకి, గోల్డు కలర్ అంచులు కుట్టించి ఇచ్చారు మా ఆశ్రమం రాజమ్మగారు. ముడులూ అవీ కూడా ఆవిడే వేశారు. దండం,

కమండలం, పావుకోళ్ళూ మా స్వామీజీవి. పార్వతీశంగాడైతే కణ్వమహర్షి శిష్యుడిగా జీవించేశాడు. వాడికా మెల్లకళ్ళు లేకపోతే సినిమా యాక్టరు అమ్మా బాబైపోయుండేవాడు.

లైటింగ్ మా ఫ్రెండు జిజ్జా అనబడే బర్మా వెంకటేశ్వరావుగాడు చేశాడు. వాడు చిన్నప్పుడే చదువుమానేసి ఎలక్ట్రిక్ పని నేర్చుకున్నాడు - లౌడు స్పీకర్లు హైస్కూలివే.

***శకుంతల ద. డే. ఆఫ్ సక్సెస్.***

తెల్లని నైలాన్ చీరకి బంగారు రంగు అంచులు కుట్టించి బ్రహ్మాండంగా తయారు చేశారు నన్ను మా రాజమ్మగారు. తలమీద అందంగా కొప్పు. దానికి చుట్టిన మల్లెలూ! జూకాలు మా భాగ్యంగారివి, అంటే, మా అమ్మవి.! సణుక్కుంటూనే ఇచ్చింది. మా హెడ్మాస్టరు పేరి రాజారావుగారొచ్చి, ఎనౌన్స్ చెయ్యగానే జనాలు చప్పట్లు చరిచారు.

తెరతియ్యంగానే పూవులు కోస్తున్నట్టు నటిస్తూ నేను -

"రారే చెలికత్తెలార రారే పూదోటకీ

రారే ఇటు రారే అటు చూడరే...

అవిగవిగో మల్లెపులు.. అవిగవిగో కలవపులు

పూలు కోసి మాలకట్టి పూజలు చేతమురారే" ||రారే చెలికత్తెలారా||

అంటూ పాటందుకున్నా.! అంతే నాటకం అయ్యేంత వరకు నేను సీతని కాను.. ఏదో వెర్రిపుట్టినట్టయింది. దుష్యంతుడు వద్దన్నప్పుడు నా కన్నీళ్ళు కారుతూనే వున్నాయి. జనాలు సైలెంటుగా ఉన్నారు. జనాలు ఉన్నారన్న ధ్యాసే నాకు లేదు.

అన్నట్టు నేను రాసిన మూడుపేజీల నాటకాన్నీ తరవాత ఓ రోజున మా ప్రాక్టీసు చూసిన కృష్ణారావుగారు, ఇరవైపేజీలకి పెంచి తిరగరాశారు.

చివరికి భరతుడూ దుష్యంతుడూ కలవటంతో నాటకం పూర్తయింది. చప్పట్లే చప్పట్లు. మతిమరుపు అమ్మాజీకూడా, ఒక్క డైలాగైనా మర్చిపోకుండా బ్రహ్మాండంగా నటించింది.

నాటకం అయ్యాక తెరవెనక నించి తొంగిచూస్తే, మా అమ్మ ఏడ్వటం కనిపించింది. పక్కనే మా నాన్న! ఆ డ్రెస్సుతోనే గబగబా మా అమ్మ దగ్గరికి పరిగెత్తా... ఎందుకేడుస్తోందో తెలియలా. నన్ను చూడగానే లేచి, గట్టిగా కావలించుకుని, "నువ్వు నా బంగారు తల్లివే.. ఎంత పుణ్యం చేసుకుని నిన్ను కన్నానో గదే సీతా.! ఎన్నెన్ని తిట్టానే నిన్నూ, నా నోరు పడిపోనూ!" అంటూ ఏడుపుని ఇంకా పెంచింది. 'ఇందుకా ఏడ్చేది' అని నాకు నవ్వొచ్చి, "అందరూ చూస్తున్నారు నోరుముయ్యవే పెదపాడు శ్రీలక్ష్మి కూతురా!" అన్నాను. అంత ఏడుపులోనూ మా అమ్మకి నవ్వొచ్చింది. అంతేగా మనకి కావల్సింది! ఫస్టుప్రయిజ్ నాకే! సెకెండ్ ప్రయిజు పార్వతీశంగాడికీ + అమ్మాజీకి. థర్డ్ ప్రయిజ్ విశ్వామిత్రుడి వేషం వేసిన (చివర్లో) సింహాద్రిగాడికి. మిగతా ప్రోగ్రాములిచ్చిన వాళ్ళుకూడా ఏమాత్రం అసూయలేకుండా మమ్మల్ని మెచ్చుకున్నారు. మా అమ్మ ఇంటికెళ్ళాక ఉప్పుతోటీ, ఉప్పూ మిరపకాయలతోటీ, చివరిగా కొబ్బరికాయతోటీ దిష్టితీసింది. మా నాన్నమాత్రం ఒక్క మాటమాట్లాడలా. ఉండబట్టలేక, "ఏం నాన్నా నా వేషం బాగోలేదా?" అన్నాను చిన్నబుచ్చుకుని.

ఆయన బొటబొటా కన్నీళ్ళు కార్చి, నన్ను కావలించుకుని "నిన్ను చూస్తే అచ్చం మా అమ్మని చూసినట్టుందే సీతా!" అని భోరుమన్నాడు - ఇంకేం మాట్లాడనూ?

ఒక్క సుడిగాలితో వెయ్యి మబ్బులు ఎగిరిపోయినట్టుగా, ఒక్క 'శకుంతల' నాటకంతో నా మీద వుండే 'నీలాపనిందల'న్నీ తొలిగిపోయినై. ఎక్కడికెళ్ళినా "ఎంత బాగా చేశావే సీతా!", "అబ్బ ఎంత అందంగా వున్నావే సీతా ఆ శకుంతల వేషంలో!" అనో

పొగిడేవాళ్ళే. ఆఖరికి కోవటి గురవయ్యకూడా, "మామిడికాయలు కావాలిత్తే మహారాజాలా కోసుకుకెళ్ళమ్మాయ్! కాన్డబ్బు తీసుకోను!" అని రెండు జీళ్ళూ, రెండు మరమరాల వుండలు ప్రేమగా పొట్లం కట్టి మరీ ఇచ్చాడు.

నాకే ఆశ్చర్యం... యాక్టింగ్ ఎవరూ నేర్పలా.. ఎలా చెయ్యగలిగానూ అని. తరవాత అర్థమైంది. సురభినాటకాల వాళ్ళ హావభావాల్ని తెలియకుండానే అనుకరించివుంటానని. `అనుకరణ` అనేది అసంకల్పితంగా జరిగే `మనోచర్య.` మళ్ళీ పరీక్షలు.. చదువులతో పాకబడి వాళ్ళం అందరం బిజీ అయిపోయాం. కంబైన్డ్ స్టడీతో పరిక్షలంటే భయంపోయి మాకందరికీ ఉత్సాహం వెల్లువెత్తేది. మధ్య మధ్యలో సరదాకి చిన్న చిన్న `చోరీ`లు కానిచ్చినా జనాలు నవ్వేసే వాళ్ళేగానీ పెద్దగా పట్టించుకునేవాళ్ళు కాదు. దానివల్ల `చోరీ`చెయ్యాలనే ఉత్సాహం ఎగిరిపోయింది. గొడవలైతేనేగదా మజా వుండేది! ఆ `కిక్కు`లేనప్పుడు `చోరీ`లు చప్పగా ఉండక ఛస్తాయా.!?

మా అమ్మ `తలంట్లు` తగ్గించడంతో నాకు టైంపాస్ లేకుండా పోయింది. ఆవిడ నన్ను తిడుతూ ఉన్నంతకాలం మహోహుషారొచ్చేది. ఇప్పుడేమో ఒక్కమాట అనదు సరికదా పొగుడుతూ వుంటుంది. బుద్ధిలేక శకుంతల వేషం వేశానని అప్పుడప్పుడు నాకు అనిపించేది.

పరీక్షలు అయిపోయాయి. ఏం చెయ్యాలీ?

"ఒసేయ్ సీతా.. బాజీగాడు గురుభట్ల గూడెం రోడ్డులో సైకిల్ షాపు పెట్టాడే! పిల్లలకోసం రెండు బుల్లిబుల్లి సైకిళ్ళు కూడా తెచ్చాడేవ్!" అంటూ అత్యంత ఉత్సాహభరితమైన సమాచారాన్ని మోసుకొచ్చాడు డొంకాడ వెంకట్రావుగాడు.

"అద్దె ఎంత?" అడిగా.

"గంటకి అణాన్నర అన్నాడుగానీ, అణాకి బేరం ఆడొచ్చే!" అన్నాడు. ఓ పావలా బిళ్ళ పట్టుకుని, "అమ్మా. ఇప్పుడే వస్తా!" అంటూ బయటపడ్డా.

బాజీగాడూ మా క్లాసుమేటే.. అంటే, ఫస్ట్‌ఫాంలో. వాళ్ళ నాన్నకి సైకిల్ షాపు ఉంది. దానిలోనే వీడూ ఖాళీ టైంలో పనిచేసేవాడు. టైర్లు విప్పడంలోనూ `పేచీ`లు వెయ్యడంలోనూ ఆల్‌రెడీవాడు ఎక్స్‌పర్ట్ అయిపోయాడు. ఫస్టుఫాం చివర్లో వాళ్ళ నాన్నకి జబ్బు చేస్తే వాడు స్కూలు మానేసి సైకిల్ షాపు నడుపుతున్నాడు. వాళ్ళ షాపు సత్తుపల్లి రోడ్డులో వుండేది. ఇప్పుడిది రెండోది అన్నమాట.

"అందరికీ అణాన్నరే! నీకు మాత్రం అణా.. ఎవ్వరికీ చెప్పనని ఒట్టెయ్యి!" అని ఒట్టు వేయించుకుని మరీ సైకిలిచ్చాడు. సైకిలుంది సరే, మరి తొక్కడం మనకి రాదుగా! ఆ మాటే బాజీతో అంటే, వాడు, "నేనే నేర్పిస్తాలే.. అయితే నీకు నేర్పించేంతసేపు డొంకాడగాడ్ని షాపులో ఉంచాలి!" అన్నాడు.

"ఒక పని చేద్దామే.! ముందర నీకు `పక్క తొక్కుడు` నేర్పిస్తా. అప్పుడు పెద్ద సైకిలైనా యీజీగా తొక్కొచ్చు.!" అని పెద్ద సైకిల్ తీశాడు.

పక్క తొక్కుడంటే ఓ సైడ్ నించి తొక్కటం అన్నమాట. పెద్ద సైకిలైతే మనకి కాళ్ళందవు! అదీగాక ఆ సైకిలు ఆడవాళ్ళు తొక్కాలంటే ఇబ్బంది.. కడ్డీవుంటుంది గనక.

`సైడ్ పెడలింగ్` మొదట్లో చాలా కష్టం. ఒక పక్కనించే తొక్కుతాం గనక బరువంతా ఒకవైపే వుంటుంది. బేలన్స్ చెయ్యలేకపోతే ఢమాల్న కిందపడటమే.

బాజీ పాపం గంటసేపు నాతో సైకిలు తొక్కించే ప్రయత్నం చేశాడు. ఏడెనిమిదిసార్లు కిందపడ్డాను. ఓసారి మోకాలు ఎంత నొప్పెట్టిందంటే అసలు సైకిలు తొక్కడం మానేద్దామనుకున్నాను. "నువ్వు మనసు పెట్టాలిగానీ ఇదెంతసేపు!" అని బాగా నన్ను ఉత్సాహపరిచాడు. ఓ గంట అయ్యాక నేనూ డొంకాడగాడూ ఇంటికి బయల్దేరాము.

"నువ్వు నేర్చుకున్నావుగానీ, నన్ను ఒక్కసారన్నా సైకిలు ముట్టుకోనివ్వలా!" కోపంగా అన్నాడు డొంకాడ.. మేం తిరిగివచ్చేప్పుడు.

"ఒరే వెంకటీ.! ఎవరో ఒకరు సైకిలుషాపు దగ్గర ఉండాలని బాజీగాడు చెప్పాడుగదా! నేను గనక సైకిలు షాపులో కాపలా కూచుంటే ఊరందరికీ తెలిసిపోతుందిగదా! ఆడపిల్లని గనక నన్ను తిట్టకపోయినా, నీకు మాత్రం ఇంట్లో 'తాషా మర్పా' తప్పదుకదా! అంచేత ప్రస్తుతం నువ్వు నాకు సహాయం చేస్తే, నేనే నీకు సైకిలు నేర్పుతా!" అని భరోసా (మా వూళ్ళో బరవసా అంటారు) ఇచ్చా.

"నన్నెందుకు కొడతారూ సైకిల్ తొక్కితే?" అన్నాడు ఆశ్చర్యంగా మొహం పెట్టి.

"నువ్వు తొక్కేటప్పుడు 'అద్దె' నువ్వే ఇచ్చావని మీ అమ్మానాన్నా అనుకుంటారుగానీ, నేనిచ్చానని అనుకోరుగదా! ఆ అద్దెడబ్బుల్ని నువ్వు 'కొట్టేసినవే' అనుకుంటారుగానీ వాళ్ళిచ్చినవి కావని వాళ్ళకి తెలుసుగదా!" అన్నాను.

"ఏమిటోనే నువ్వు ఏదేదో చెప్పి నా నోరు మూయిస్తావు!" కాస్త బుంగమూతి పెట్టాడు. ఆ రోజు సాయంకాలం నాలుగింటికి మళ్ళీ బాజీగాడి పర్యవేక్షణలో సైకిలు తొక్కాను. ఈసారి గంటలో ఒక్కసారి కూడా పడలేదు.

"ఫరవాలేదే! ఇంకో రెండురోజులు ఇలా తొక్కితే మూడోరోజు నించీ రోడ్డెక్కొచ్చు!" అన్నాడు.

ప్రస్తుతం నేను సైకిలు తొక్కడం నేర్చుకునేది 'కాంతంపాలెం' వెళ్ళేదోవలో వున్న మామిడితోటలోనన్నమాట.

బాగా అనుభవం వుంటేగానీ మరి రోడ్డు ఎక్కకూడదని బాజీగాడే చెప్పాడు. దేనికన్నా గుద్దేస్తే డేంజర్ కదా!

మరీ మూడురోజులు కాదుగానీ, యమా కాన్ఫిడెంట్‌గా తొక్కటానికి వారం రోజుల పైనే పట్టింది, కాంతంపాలెందాకా. ఎనిమిదో రోజున నేను ఒక్కదాన్నే తొక్కుకుంటూ వెళ్ళాను. తొమ్మిదోరోజున సైకిల్ మీద సమ్మిటారిగూడెం వెళ్ళి వంకాయలపాటి ఆదినారాయణగాడ్ని 'విజిట్' చేశాను.

మధ్యమధ్యలో డొంకాడగాడిని కూడా పావుగంటో అరగంటో సైకిలు నేర్చుకోనిచ్చాను గనక వాడూ 'సైకిల్ డ్రైవర్' అయిపోయినట్టే.

ఏదైనా పని మొదలెడితే అది అయ్యేదాకా నాకు నిద్దరపట్టదు. ఫుల్ ట్రాఫిక్‌లో సైకిల్ నడిపితేగానీ సైకిల్ తొక్కడం వచ్చినట్టు కాదుగదా! ఓ బేడా బాజీగాడికిచ్చి "ఇవ్వాళ మెయిన్ రోడ్డులో తొక్కుతాన్రా!" అన్నాను. "లైసెన్సుండాలే, లేకపోతే గొడవొస్తుంది!" అన్నాడు వాడు భయంగా.

"ఫర్వాలేదురా!" అని సైకిల్ ఎక్కి (అంటే సైడ్ తొక్కుడన్నమాట) మహాజోరుగా తొక్కుతూ అటు మా హైస్కూలుదాకా, అక్కడ్నించి టర్న్ కొట్టి 'సా'మిల్లుదాకా, అక్కడ్నించి టర్న్ కొట్టి రామకృష్ణానగర్ మీదుగా ఆశ్రమం దాకా, అక్కడ్నించి రైట్ తిరిగి మళ్ళీ బస్టాండుదాకా వీరలెవెల్లో సైకిల్ తొక్కుతూ ఆనందించా.

ఆనందం ఎందుకంటే, రోడ్డుమీద వెళ్ళే ప్రతీవాళ్ళూ నన్ను చూసి ఆశ్చర్యపోవటమే! ఆడంగులైతే కొందరు ముక్కుమీద వేళ్ళు వేసుకుంటే ఇంకొందరు ముక్కూ మూతీ విరిచారు. కొందరైతే, "కలికాలం అంటే ఇదేనేమో కనకమ్మొదినా.. లేకపోతే ఆడపిల్ల బరితెగించి సైకిల్ తొక్కడం ఏమిటీ?"

"యీ గడుగ్గాయిని కాదమ్మా వెంకటమ్మా, దీన్ని 'గడేకార్'లాగా పెంచినవాళ్ళ అమ్మా నాన్నల్ని అనాలి.'"

"కాలజ్ఞానంలో చెప్పలా.. ఆడముండలు ఊళ్ళేలతారనీ!" ఇలా ఇష్టమొచ్చిన మాటలు విసిరారు.

నేనేం పట్టించుకోకుండా విజయగర్వంతో బాజీగాడి షాపు ముందర స్టాండువేసి "నీ మేలు మర్చిపోనురా బాజీ!" అని సినిమా ఫక్కీలో వాడికి థాంక్స్ చెప్పాను.

నిజంగా మా ఇద్దరికీ అప్పుడు తెలీదు. పెదపుల్లేటికుర్రులో ఒక ఆడపిల్లకి సైకిల్ నేర్పిన గురువుగా వాడిపేరూ, పెద్దపుల్లేటికుర్రు చరిత్రలో మొట్టమొదటి సైకిల్ తొక్కిన వీరాధివీరవనితగా నా పేరూ ఎక్కి ఆ చంద్రతారార్కమూ నిలబడిపోతాయని.

ఈ 'చరిత్రకారిణి' తన కూతురేనని గర్వపడకండా ఇంటికెళ్ళగానే మా అమ్మ, "సైకిల్ తొక్కుటావుటే భడవా.. ఆడపిల్ల సైకిల్ తొక్కడం అసలు మన ఇంటావంటా ఉందా? ఊరుకున్న కొద్దీ తెగరెచ్చిపోతున్నావు" అంటూ నా వీపుని చాకి బండకింద మార్చి రేవు పెట్టేసింది.

మా నాన్న ఎంత చెప్పినా వినిపించుకోదే! నా వీపు విమానం మోత మోగటమేగాక, ఆ దెబ్బలకి నేను ఏడ్చిఏడ్చి కళ్ళు వాచిపోయాయి.

అట్టాగే నిద్దరపోయా. బాగా రాత్రయ్యాక, "బుజ్జీ లేమ్మా.. నీకోసం బంగాళదుంప అల్లం పచ్చిమిర్చి వేసి నిమ్మకాయ పిండి బ్రహ్మాండంగా చేశాను. ఇంకా కందిపచ్చడి చేశాను. నీకు ఇష్టం అని 'రామములక్కాయల్తో' చారు కూడా పెట్టాను" అంటూ ఏమీ జరగనట్టే నన్ను తిండిపేరు చెప్పి వూరించబోయిందిగానీ నేను ఒక్కమాట కూడా మాట్లాడలా. ఆవిడవంక చూడను కూడా చూడలా.

"చేసిన వెధవపని చాలక 'అలక' కూడానూ! ఫో! నువ్వన్నంతింటే ఊరికి ఉపకారమా? కడుపు కాలితే చచ్చినట్టు నువ్వే దిగొస్తావు అంటూ నానా అరుపులూ అరిచిందిగానీ, దానికీ నేను బెసకలా. మరుసటిరోజున అంట్లుతోమే 'రామి', "ఇదేంటమ్మగారూ, వండినవన్నీ నాకు ఇచ్చేత్తన్నారు.. రాత్రిరెవురూ తిండి తిన్లేదా?" అని అడిగాకే నాకు అర్థమైంది.. అమ్మా నాన్నా కూడా ఆ రాత్రి పస్తున్నారని. అప్పుడు కూడా బింకంగానే కూచున్నా. చివరికి మానాన్న నాకు 'తృప్తి' కలిగేంతగా మా అమ్మని తిట్టి, నన్ను చాలా బుజ్జగిస్తేగానీ, ఆవిడ చేసిన పెసరట్టుప్మా ముట్టలేదు. ఎంతయినా యీ సీత పంతం పడితే పంతమేగదా!

రిజల్టు వచ్చింది. ఫస్టు మనదే! ఆ ఆనందంతో మా నాన్న "నువ్వు బంగారానివే సీతా.! ఏం కావాలో చెప్పు.. కొనిస్తా!" అని వరం ఇచ్చేశాడు.

"లేడీస్ సైకిల్ కొనిస్తే కొనివ్వు.. లేకపోతే నాకేం వద్దు!" అన్నా.

"లేడీస్ సైకిలా?" మా నాన్న నిర్ఘాంతపోయాడు. ముందే చెప్పాగా, ఆ రోజుల్లో ఆడవాళ్ళ సైకిల్ తొక్కడం నిషిద్ధం అనీ.

"మీ అమ్మ మనిద్దర్నీ ఉతికి ఆరేస్తుంది. అది తప్ప ఇంకేదన్నా అడగవే!" బతిమలాడాడు మా నాన్న.

"నాన్నా.. యీ కామ్రేడ్ సీత మాటంటే మాటే! అయితే సైకిలు లేకపోతే ఏదైనా నో!" అన్నా.

"మీ తల్లీకూతుళ్ళిద్దరూ నన్ను చెండుకుతింటున్నారే. కరవమంటే కప్పకి కోపం.. మింగమంటే పాముకి కోపం.. నేనేం చేసేదిరా భగవంతుడా!?" అని నెత్తిమీద చేతులు పెట్టుకున్నాడు.

"అదో కుర్రకోతి.. అది అడిగిందల్లా ఇవ్వడమేనా?" ఇలా రకరకాల డైలాగులు విసురుతూ, అంగన్యాస కరన్యాసాలతో మా అమ్మ మా నాన్నని సాధించడం మొదలెట్టింది. సైకిలు మాట వినగానే.

"మీ పుట్టింటి 'ముల్లె' మా నాన్న ఏమన్నా అడిగాడా? పేద్ద నీ సొత్తేదో పోతున్నట్టు మాట్లాడుతున్నావూ? తన కూతురు అడిగిన చిన్న కోర్కెలు తీర్చే హక్కు కూడా మా నాన్నకి లేదా? లోకంలో ఏ తల్లి అయినా, 'అదిగో ఆ సైకిలు తొక్కే బంగారు బొమ్మే నా కూతురు' అని గర్వంగా చెప్పుకుంటుందిగానీ, నీలాగా ఏడ్చిపోదే పెదపాడు మాలక్ష్మి కూతురా!" అన్నాను. కొంచెం దుఃఖాన్నికూడా నటించా.

"నువ్వెంత ఏడ్చి మొత్తుకున్నా సైకిలు కొనిచ్చేదిలేదు!" డిక్లేర్ చేసింది మా అమ్మ. ఏం చేస్తాం! మా నాన్న మౌనంగా చోద్యం చూశాడుగానీ, పెళ్ళాన్ని ఒక్కమాట అనలా.

నేనూ చేసేది లేక ఆ రోజున ఎప్పుడూ లేనిది లైబ్రరీలోకి పోయి కూచున్నా. చందమామ బొమ్మలు చూస్తూ చూస్తూ అప్రయత్నంగానే కథలు చదవడం మొదలెట్టా.

కుందేలూ తోడేలూ కథా, తెలివైన నక్క కథా, బట్టివిక్రమార్కుడి కథ (అంటే భేతాళకథ అన్నమాట) చదివేసరికి, అప్పటిదాకా తాళం వేసి వున్న నా ఊహాలోకపు తాళం చెవి నా చేతుల్లో పడ్డట్టనిపించింది. రెండు గంటల్లో మొత్తం పుస్తకం చదివేశా, ఆ కథలముందు మా చిల్లర దొంగతనాలూ అవీ ఎందుకూ పనికిరావనిపించింది. చదవటంలో వున్న 'రుచి' ఆరోజున అర్ధమైంది. సైకిల్ లేకపోతే పీడాబాయె.. బ్రహ్మాండమైన కాలక్షేపం దొరికింది.

కొంపకి చేరి ముభావంగానే (పంతం పోకూడదు గదా!) భోంచేసి మళ్ళీ నాలుగింటికి లైబ్రరీకొచ్చా. ఏడింటిదాకా అక్కడే కూచుని పాత చందమామలు చదివా.

"ఎక్కడికి పోయావే సీతా? మీ ఫ్రెండ్సందరూ నీ కోసం తెగ వెతుకుతున్నారు!" అనడిగాడు మా నాన్న.

"నువ్వూ నీ పెళ్ళాం ఒకటేగదా! నేనేగా పరాయిదాన్ని.. అందుకే లైబ్రరీకి పోయా!" అని ఓ చురక అంటించా.

"చూశారా.! వేలడంతలేదు! ఎన్నిమాటలంటోందో!" అని మా అమ్మ నోరు తెరిచి బుగ్గలు నొక్కుకుంది. మా నాన్న చిన్నగా నవ్వాడుగానీ ఏమీ అనలా.

మా లైబ్రేరియన్ వైష్ణవులు. సన్నగా పొడుగ్గా చికాకు మొహంతో వుండేవాడు. ముక్కుమీదనించి బట్టతల మీద సగందాకా 'నామాలు' పెట్టుకునేవాడు. ముక్కుపొడి పీల్చడం ఆయనకున్న మరో సుగుణం. ముక్కుపొడి పీలిస్తే 'ల' బదులుగా 'ళ' సౌండువస్తుంది. మొదట్లో నన్ను పట్టించుకునేవాడుగానీ తరువాత్తరవాత కాస్త 'ప్రాముఖ్యత' ఇవ్వడం మొదలెట్టారు. ఎందుకంటే ఆ రోజుల్లో లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు చదివే ఆడదేలేదు. అదీ పెదపుల్లేటికుర్రులో! అక్కడా 'మన ఘనత' గుర్తించబడిందన్నమాట.

ఈ విషయమూ ఊరంతా గుప్పుమంది. "ఆ గడుగ్గాయి మగరాయుళ్ళాగా లైబ్రరీకి పోతోందిట!.. అదేవిటమ్మా మగవాళ్ళ మధ్యలో ఓ ఆడపిల్ల కూచోడం జన్మలో ఎప్పుడైనా విన్నామా?" అని చాలామంది ముక్కులూ మూతులూ విరిచారట.

ఇక్కడో విషయం చెప్పితీరాలి. ఎనిమిదేళ్ళు దాటిన ఆడపిల్ల తండ్రీనీ అన్నదమ్ముల్నీ ఐనా, ఆనుకుని కూర్చోకూడదు. అనవసరంగా 'మగవాళ్ళ'ని ముట్టుకోకూడదు. ఇహ 'పెద్దమనిషి' అయ్యాక తండ్రితో అయినా దూరం నించే మాట్లాడాలి. తండ్రీ అన్నదమ్ములూ కూర్చున్న మంచాల మీద కూచోకూడదు. ఇహ స్కూల్లో ఏ ఆడపిల్లయినా, ఏ మగవాడితో మాట్లాడినా, జనాలు చూసే చూపులకీ తిట్లకీ అంతుండదు. ఒక ఆడపిల్ల ఓ మగాడితో తిరిగిందంటే అమ్మలక్కలందరూ అర్జంటుగా 'రంకు' కట్టేస్తారు. పల్లెటూళ్ళలో యీ 'రంకులు' కట్టడం సర్వసాధారణం. కట్టేదీ ఆడాళ్ళే!

అంతేకాదు ఏ ఆడదానిమీద మరో ఆడదానికి కోపం వచ్చి నా యీ 'రంకు' కట్టే వజ్రాయుధాన్ని ప్రయోగిస్తుంది. దాని విషయం తరవాత చెబుతాను.

పాపం మా అమ్మకి యీ 'రంకులు' కట్టే విద్యరాదు. ఎవరైనా తన ఎదురుగా ఇటువంటి విషయాలు ఎత్తినా "ఎందుకర్రా ఆడవాళ్ళైవుండీ దరిద్రపు మాటలు మాట్లాడతారూ?" అని నిర్మొహమాటంగా అరిచేది. అందువల్ల 'ఆడంగులు' మా అమ్మ ముందర అట్టాంటి వాగుడు వాగేవాళ్ళుకాదుగానీ.. ఇప్పుడు ఛాన్సు దొరికింది గనక –, "ఏవమ్మా భాగ్యలక్ష్మీ మీ సీత తగుదునమ్మా అని మగాళ్ళతోపాటు లైబ్రరీలో కూచుంటే రేపు వాళ్ళూ వీళ్ళూ ఎన్ని మాటలంటారో ఆలోచించావా?" అని రమ్యాతిరమ్యంగా పురెక్కించారు.

ఇహ మా అమ్మ విజృంభించింది. 'మా వంశం', అంటే మా నాన్న వంశం పేరు ఎత్తి, అనర్గళంగా ఉపన్యాసం మొదలెట్టి వాళ్ళ 'వంశం' ఎంత నిప్పులాంటిది, ఎంత ఘనమైనదో సోదాహరణంగా వివరించింది. వినీవినీ మానాన్న "నోరు మూస్తావా రెండు తగిలించమంటావా?" అని అరిచాడు. ఆయన కోపంతో చూడటం నాకదే మొదటిసారి. పిచ్చికోపంతో మొహం ఎర్రగా చేసుకుని, "ఏమనుకుంటున్నావే నువ్వు? నా కూతురు లైబ్రరీలో చదువుకుంటోందంటే నాకు గర్వం! లైబ్రేరియన్ ఆచార్యులుగారు కూడా, 'మీ అమ్మాయి మహా తెలివైందండీ.! ఎంత ఫాస్టుగా చదువుతుందో!' అంటూ కితాబిచ్చాడు. నా కూతురు కాని పనేం చెయ్యట్లా.! ఒసేయ్ సీతా!. హాయిగా చదువుకో.. రేపే లైబ్రరీలో మెంబర్‌షిప్ ఫీజు కట్టు!. ఇదిగో అర్ధరూపాయ్!" అంటూ జేబులోంచి అర్ధరూపాయి తీసిచ్చాడు.

మా అమ్మ నిర్ఘాంతపోయి నిల్చుంది. బహుశా మా నాన్నకోపం ఆవిడా మొదటిసారే చూసిందేమో!

"నాకేం.! మీ ఇష్టం మీకూతురిష్టం.. మీరిద్దరూ ఒకటి. నేనేగా పరాయిదాన్ని!" అంటూ వంటగదిలోకి నిష్క్రమించింది.

నాకు బాగా జ్ఞాపకం. జూన్ ఒకటో తారీకున (సంవత్సరం అడగొద్దు) మా నాన్న పనున్నదని ఏలూరు వెళ్ళాడు....పొద్దున్నే!

ఆ రోజే ఆచార్యులుగారు, "అమ్మాయీ..చందమామలు చదువుతూనే వుండు.. కానీ, యీ పుస్తకం చదవడం కొంచెం కష్టమే. అయినా, యీ పుస్తకం చదువు" అంటూ 'పంచతంత్రం' అనే పుస్తకం నాచేతికిచ్చారు. ప్రతీ కథా ఓ నీతిని చెప్పేదే ఆ 'చిన్నయసూరి'గారు ఎంత మహానుభావుడో! పిల్లలకోసం ఎంత సులభ గ్రాహ్యంగా ఆ నాలుగు భాగాలూ రాశారో! ఆరోజే నేను లైబ్రరీకి మెంబర్ నయ్యా. బుక్కు ఇచ్చాక అన్నారు "ఆయుష్మాన్ భవ!" అని.

ఆ పుస్తకం చదువుతూ, వూహల్లో తేలిపోతూ నిద్రపోయా.

"సీతా.. ఇటావే!" అని మా నాన్న అరిచిన అరుపుకి నాకు మెలుకువొచ్చి బయటికి పరుగెత్తుకొచ్చా.

తళతళలాడే సరికొత్త సైకిల్ మా ఇంటిముందు స్టాండేసి ఉంది. పిచ్చి ఆనందంతో మా నాన్నని కావలించుకుని బుగ్గలమీద ముద్దుపెట్టి, సైకిల్ మీదకి ఎగిరి తొక్కుకుంటూ బయటికిపోయా. ఇక రాయలేను పాఠకుల్లారా.. నా కళ్ళనిండా నీళ్ళు వూరుతున్నై.

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments